# కాఫీ

**-అనూరాధ రామకృష్ణ**




ఉన్నట్టుండి నాలుక పిడచకట్టుకుపోతోంది. కాళ్ళు, చేతులు గుంజేస్తున్నాయి. రెండ్రోజుల్నుండి కాఫీ చుక్క తాగకుండా తనింకా బ్రతికున్నాడంటే చలపతికి తనమీద తనకే ఆశ్చర్యమేసింది.

తూర్పు తెలవారుతుందో లేదోగాని పక్కమీదనుండి లేస్తూనే వేడి వేడి కాఫీ గ్లాసు కనబడకపోతే చలపతికి పిచ్చెక్కిపోతుంది.

అదేం కలికాలమోగాని ఉన్నట్టుండి దేశంలోని అన్ని ప్రాంతాల్లో కాఫీ, టీ తోటలు ఎండిపోయి వాటికి విపరీతమైన కరువుకాటకాలు వచ్చిపడ్డాయి.

ఉన్న సరుకంతా బ్లాకులో అమ్మేసుకొని వ్యాపారులంతా సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడు ఏ షాపుల్లోను కాఫీ, టీ అమ్మకాలు లేవు. యుద్ధ సమయంలో పసిపిల్లల పాలడబ్బాలకు కరువు వచ్చినట్టు - కాఫీ, టీలకు కరువొచ్చింది. చెట్లకింద కాఫీ, టీ బంకులు లేవు. కాఫీ హోటళ్లలో కాఫీ, టీ అమ్మటం లేదు.

ఇంకా కాఫీ విదేశాలనుండి దిగుమతి చేసుకోవటం వ్యాపార లావాదేవిల్లోనే వున్నాయి. ఇంకా రెండు నెలలవరకు పరిస్థితి ఇంత దారుణంగానే ఉంటుంది.

అప్పుడే కాఫీ, టీ లేక చాలామంది గుండెపోటుతో మరణించారు. ఎవరింటికి పోయినా చల్లని మజ్జిగో, ఫ్రూట్ జ్యూసో ఇస్తున్నారు.

వారం రోజులు గడచిపోయాయి. గ్యాస్ అయిపోయినా, పంచదార అయిపోయినా కట్టెలు, బెల్లం వేసుకొని ఉపయోగించవచ్చు.

దేవుడా! ఈ కాఫీ పొడి దొరకటం లేదు! దానికి బదులుగా వాడేందుకు ఏ ప్రత్యామ్నాయం దొరకటం లేదు.

కాఫీ తాగనిదే కాలకృత్యాలు తీర్చుకోవటం ఆలస్యమైపోతోంది. దానితో ఆఫీసుకు లేటు, బాస్ చేత చివాట్లు, చాలామంది ముఖం వేలాడేసుకొని తిరుగుతున్నారు.

కాఫీ పొడి మార్కెట్‌లోకి ఎప్పుడు వస్తుందా అని ప్రజలంతా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. దేశమంతా కాఫీ ఎమర్జెన్సీ ఏర్పడింది.

కాఫీ వ్యసనంతో చలపతి పేషెంట్‌లా తయారైనాడు.

ఇప్పుడు కాఫీ తాగకపోతే తను ఎక్కువ రోజులు బ్రతకలేననే నిర్ణయానికొచ్చేశాడు. చావబోయే కొద్దిరోజులముందైనా సత్య మనసు నొప్పించకుండా తనతో బాగుండాలని నిర్ణయించుకున్నాడు.

"సత్యా" అరిచినట్టే పిలిచాడు. వంటగదిలో కాఫీ కలుపుతున్న సత్యభామ కాఫీ గ్లాసుతో బెడ్‌రూంలో ప్రత్యక్షమైంది.

చలపతి నిద్ర లేవగానే బెడ్‌రూంలోనే కాఫీ త్రాగుతాడని ఆమెకు తెలుసు.

ఏదో మైకంలో లేచినట్టు లేచి కూర్చున్నాడు. తెల్లవారుఝామున ఐదు గంటలవుతోంది.

"ఇదిగోనండి కాఫీ" గ్లాసు చేతికందించింది.

దాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"సత్యా! ఇది...ఇది.. నిజంగా కాఫీనేనా?" అనుమానంగా అడిగాడు.

"అదేమిటి, రోజు త్రాగే కాఫీయే గదా! ఏమిటి అలా వున్నారు. ఏమైనా కలగన్నారా?" అడిగింది.

ఇప్పటివరకు ఎంత సజీవమైన కలకన్నాడు. కొన్ని తరాల తరువాత కరెంటు, నీరు అనేవి తెలియకుండా పోతాయన్నారు. కాఫీ పొడికే ఆ ప్రమాద పరిస్థితి వచ్చేట్టుంది.

సాయంత్రం ఆఫీసునుండి వచ్చేప్పుడు నాలుగు కాఫీపొడి పొట్లాలు తెచ్చి పెట్టాడు.

☆